# ఉభయతారకం

హుటాహుటిగా పోర్టికో కిందకి దూసుకొచ్చి నిలుచుంది మహిషం. అంత వరకూ తీరికగా పొగ చుట్టలు సేవిస్తూ ముచ్చట్లు చెప్పుకుంటున్న కింకర సమూహం "అయ్యబాబోయ్! వచ్చేశాడురా యముడు" అని చుట్టలు పారేసి లేచి, ఎవరి స్థానంలో వాళ్ళు భయభక్తులతో నిలుచున్నారు. తన బరువంతా రెండు కాళ్ళమీదనే మోపి ధర్మదేవత సింహాసనం వేపు హాల్లోకి కదిలి వెళ్ళింది.

కింకరులు జయజయధ్వానాలు చేస్తూ దారి చూపుతూ యముని ముందుగా వెళ్ళారు. సింహాసనంలో కూలబడ్డాక యముని మొహం గంభీరంగా వెలిగిపోయింది. ఒక్క క్షణం కొలువు నిశ్శబ్దంగా ఎదురుచూసింది యమధర్మరాజు కళ్ళలోకి.

అధికారి ఎంత తక్కువ మాట్లాడితే అంత హుందాగా ఉంటాడు. భృత్యుడు ఎంత వినయంగా విన్నవించుకుంటే అంత సమర్థుడని ప్రశంసలు పొందుతాడు. అందుకే యముడు తన కుడిచేతి మునివ్రేళ్ళతో మీసాన్ని సవరించి నే చెప్పిన విషయం ఏమిచేశావని అర్థవంతంగా కనుబొమలను ఎగరేస్తూ తన కుడిచేతి వేపు కూర్చున్న శాస్త్రీ వేపు దృష్టి సారించాడు.

చిత్రగుప్తుడు కాస్త అయోమయంగా చూశాడు. నిజమే. ఎవరి సంగతో కనుక్కోమని క్రిందటి సభ తర్వాత అనధికారంగా చెవిలో చెప్పాడు. యమధర్మరాజు వ్యవహారాలు వేలు, లక్షలు. అందులో ఏ వ్యవహారమో చప్పున గుర్తుకు రావడం లేదు. తిరుపతిలో లక్షా యాభై బోడిగుళ్ళు. అందులో ఏ గుండు సంగతి ఇప్పుడు అడుగుతున్నాడో గుర్తు చేసుకోలేక పోతున్నాడు చిత్రగుప్తుడు. ఎదురు ప్రశ్న వేస్తే అపచారం. తన ప్రయోజకత్వానికీ, యమధర్మరాజు అధికార ప్రతిష్టకూ హాని. చిత్రగుప్తుని ఇబ్బందిని పసికట్టిన యముడు పెదవి కదపకుండానే తన కుడిచేతిని పైకెత్తి అభయ హస్తముద్ర చూపించాడు. చిత్రగుప్తుడిది కుశాగ్రబుద్ధి. "మహాప్రభూ! ఆ అభయతారకం విషయమే కదా తమ మనసులో మెదలినది? ఆ విషయంలో ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా కింకర ద్వయాన్ని పంపించాను. అదిగో

14132



వారిద్దరి మనవినీ ఆలకించండి" అని తన బాధ్యత తీరినట్లు ఇద్దరు కింకరుల వేపు చూశాడు.

చేతులు కట్టుకుని నిల్చున్న కింకరులు వినయంతో తమ చేతకానితనాన్ని తెలియజేస్తూ దైన్యంగా మొహాలు వేలవేసుకున్నారు. అర్థంచేసుకున్న యముని కళ్ళలో ఎర్రనిజీర మెరిసింది. ఇంతేనా మీ ప్రతిభ అన్నట్లు నిరసనగా చూసి చిత్రగుప్తుని వేపు తన కాయాన్ని తిప్పి "ఈ అభయతారకం మన పాలిటి మార్కండేయుడుగా పరిణమించడు కదా? చిట్టా ఆవర్జాలు పెట్టుకున్న వాడివి. వీడి వెనుక ఏదైనా దివ్యశక్తి ఉండి రక్షిస్తున్నదేమో కాస్త చూడు. వీడి పాప పుణ్యాలను వివరించు" అన్నాడు.

"పిల్లా జల్లా, యువతీ యువకులు, ముసలీ ముతకా, పశువులూ పక్షులూ అన్న విచక్షణ లేకుండా వేల సంఖ్యలో సర్వప్రాణాల్ని మెత్తమెత్తగా హతమార్చేస్తున్నాడు ప్రభూ!" చిత్రగుప్తుని మనవి.

"యుద్ధోన్మాదమా? మత మౌఢ్యమా?"

"కాదు ప్రభూ! పెద్ద మందుల తయారీ పరిశ్రమ".

"మరి మందులు ఆరోగ్యాన్నిచ్చి ప్రాణాలు కాపాడాలి కదా. అలా కలిగిన పుణ్యం ప్రభావమేమీ లేదా? పుణ్యఫలం మాటేమిటి?"

"నిజమే ప్రభూ! ఆ పుణ్యకార్యానికి గానూ ప్రభుత్వం నించి చౌకగా జాగాలూ, పన్నుల మినహాయింపులూ, ఎన్నెన్నో రాయితీలూ, సదుపాయాలూ పొందాడు - కానీ -"

యముడు కనుబొమల్నిఎగరేసి, ఏమిటీ "కానీ," మధ్యలో అని అసహనంగా చూశాడు. ఇక నీళ్ళు నమలకుండా చిత్రగుప్తుడు విన్నవించుకున్నాడు.

"చాప కింద నీరులా, స్లో పోయిజన్‌లా, జలవాయు కాలుష్యంతో చుట్టూ ఉన్న జనావాసాలలోని వాళ్ళ ఆరోగ్యాన్నీ ఆయుష్షునీ హరించివేస్తున్నాడు - "

"అదెలా?"

"పాతాళాన్ని తాకే దిగుడు బావిలోకి కాలుష్యాన్ని, వ్యర్థపదార్థాల మడ్డినీ వదిలి పెడతాడు. అర్థరాత్రి వేళా, తెల్లవారి ఝామునా అందరూ నిద్రలో ఉండగా విషం లాంటి పొగలూ సెగలూ గాలిలోకి విడిచిపెడతాడు. ప్రభుత్వం సరఫరా చేసే మంచినీరే అంతంతమాత్రంగా ఉంటే, బావులమీదా బోరింగు నీళ్ళమీదా ఆధారపడ్డ వాళ్ళకు నీరు లేకుండా భూగర్భజలాన్ని కషాయంగా మార్చేస్తాడు".

"మరి ప్రజలు ఊరుకున్నారా? కోర్టులేమి చేస్తున్నాయి?"

"ప్రజల్నీ సంక్షేమ సంఘాల్నీ చీల్చిపారెయ్యడం, చట్టాలలోని లొసుగులు కనిపెట్టి కోర్టుల్లో స్టే తెచ్చుకోవడం, వాడికి కొట్టిన పిండి. ఒక బస్తీలో దర్గాకు విరాళం ఇస్తాడు, ఒక

కాలనీలో దేవుడికి ధ్వజస్తంభం కట్టిస్తాడు..."

"ఓహో! ఓహో! అర్థమైపోయింది. కాలుష్య నియంత్రణ మండలి ఉంది కదా? వాటికి విశేషమైన అధికారాలున్నాయే!"

"నిజమే ప్రభూ! తప్పనిసరి అనిపించినప్పుడు వ్యర్థ పదార్థాల్నీ, వాయువుల్నీ శుభ్రపరిచే ప్లాంటు యంత్రాల్ని చిన్న పిల్లలకి అద్దంలో మిఠాయి చూపించినట్టు చూపిస్తాడు. అత్యవసర సమయాల్లో నామమాత్రంగా వాడుతాడు."

"నామ మాత్రం అంటే?"

"అధికారులు తణిఖీకి వస్తున్నాం అని చెప్పినప్పుడు"

"వాటిని సక్రమంగా నడిపితే మందులాడికేమైనా నష్టమా?"

"చాలా నష్టం ధర్మప్రభూ! లాభాలు తగ్గిపోతాయి, ఖర్చులు పెరుగుతాయి".

"మరి విరాళాలు ఇస్తే ఖర్చు కాదూ?"

"సక్రమంగా ప్లాంటు నడిపితే అయిన ఖర్చులో శతాంశం ఉండవు ఈ విరాళాల మొత్తం".

"మరి ప్రభుత్వం చూస్తూ ఊరుకోగలదా?"

"అటునుంచి వేరేవిధంగా నరుక్కువస్తాడు ప్రభూ! బోలెడు గుడ్‌విల్ - అంటే మంచి పేరు- సంపాదించి పెట్టుకుంటాడు.

"ఇంత జనహాని చేసేవాడు గుడ్‌విల్ ఎలా సాధిస్తాడు! అది సాధ్యమా?"

"పాలనురుగులాంటి బట్టలేసుకుంటాడు. మల్లెపువ్వులాంటి టోపీ పెట్టుకుంటాడు. వరదలొచ్చినా, ఉప్పెనలొచ్చినా అగ్ని ప్రమాదాలొచ్చినా, కరువు కాటకాలొచ్చినా మనసు కరిగి ప్రభుత్వానికి ఆప్త బంధువులా మొదటి విరాళం ప్రకటిస్తాడు. మంత్రి పదవికోసం కానీ శాసన సభ్యత్వంకోసం కానీ ఏ మాత్రం ఆశపడి తన మీద బాధ్యతలు వేసుకోడు. కానీ తనకుపయోగపడే వాడి నెవ్వడినో పట్టుకు చేరదీసి, వాణ్ణి నిలబెడతాడు. కేంద్ర నేతల్నించి రాష్ట్రస్థాయి పెద్దలదాకా అందరికీ వాళ్ల జన్మదినాలు జ్ఞాపకం ఉన్నా లేకపోయినా వీడిడైరీలో ఆ తేదీలు రాసుకుని సక్రమంగా ఆరోజున మొట్టమొదట అందేటట్టు శుభాకాంక్షలు పంపుతాడు. స్థానిక నేతలైతే రెండు జాతి గులాబులో, అపురూపమైన దానిమ్మ పళ్ళో తన చేత్తో కానుకగా సమర్పించి నమ్రత ప్రకటిస్తాడు. విదేశాల వైద్యానికి వెళ్లివస్తే తొలి పరామర్శ తనే చేస్తాడు".

"ఆపు ఆపు కాలం విలువైనదే. కాలక్షేపం చెయ్యకు. ఇలాంటి జాగ్రత్తలు అందరూ ఈ రోజుల్లో చేస్తూనే ఉన్నారు. ఇంకేమైనా ప్రత్యేకత ఉన్నదా ఇతని పద్ధతిలో?".

"ఉన్నది స్వామీ! లౌకిక న్యాయంలోనూ, ముందు చూపులోనూ అందరికన్నా మిన్న"

"దానికి సాక్ష్యం?"

"నగరంలో ఒక దిక్కున అతని మందుల కంపెనీ మూడుపువ్వులూ ఆరుకాయలై ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ రోగగ్రస్తుల్ని చేస్తూ ఉంటే ఇంకోదిశలో - కొత్తగా ఫ్యాక్టరీ ఒకటి తన బంధువు పేరున బినామీగా గత సంవత్సరం వెలిసింది. ఈ వార్షికోత్సవంనాడు పెద్దపెట్టున ప్రశంసలూ అవార్డులు అందుకోబోతున్నది".

"అందులో ఉత్పత్తి చేసేదేమిటి?"

"గాలిలో ఘాటైన కాలుష్యం వచ్చి తల తిరిగే సమయంలో ప్రజలు ముక్కుకు తగిలించుకునే ఆరోగ్య రక్షక కవచం తయారు చేస్తుంది. ప్రజలు వాటికోసం ఎగబడుతున్నారు. ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. నీటిలోని కాలుష్యాన్ని వేరు చేసి నీటిని శుభ్రపరిచే మాత్రలేవో వచ్చే ఏడాదినుంచీ ఉత్పత్తి చేస్తారట".

"ఔరా! ఏమికుశాగ్రబుద్ధి! వీడికి అభయతారకం అన్న నామము చాలా పేలవంగా అర్థరహితంగా ఉంది. ఉభయతారకం అంటే సార్థకమేమో? అయినా వీడొక అభినవ మార్కండేయుడై నా అధికార ప్రతిష్టకు హానిగా పరిణమించకుండుగాక! నేటికి ఈ పేరోలగము చాలించుదాము..."

చిట్టా ఆవర్జాలు మూసి కట్టకట్టిన చిత్రగుప్తుడు ఇవ్వాల్టికి బ్రతికి పోయామురా అని నిట్టూర్చాడు ధర్మదేవత హుందాగా ముందుకు సాగిపోయాడు.

(జాగృతి దీపావళి ప్రత్యేక సంచిక - 94)